# ఆశా బలం

ఆ రోజు ఆదివారం. అయినా ఊళ్ళోకి వెళ్ళడానికి - సంతోషంగా తిరగడానికి అవకాశం కనిపించలేదు. ఏం చెయ్యడానికి తోచక గదిలో పచారు చేస్తున్న సమయంలో నా కంటికి - ఆశా రేఖలా - పంచాంగం కనిపించింది. పంచాంగం తెరిచి చూస్తున్నాను. సరిగా అదే సమయంలో గోపాలం తుఫానులా నా గదిలో ప్రవేశించాడు.

'ఐదు గంటలు దాటిపోయింది. ఈ దిక్కుమాలిన గదిలో ఏం చేస్తున్నావు?' అన్నాడు వస్తూనే.

నేను జవాబు చెప్పే లోగా నా చేతిలో పంచాంగం లాక్కుని చూసి ఆశ్చర్యపోయి 'ఏమిటి నువ్వు చేస్తున్నది? పంచాంగం ఎందుకు చూస్తున్నావు?' అన్నాడు.

'కూర్చో చెబుతాను!' అన్నాను స్తిమితంగా.

'కూర్చొను— నీ అసలు రంగు యీ వేళ బయట పడింది. నువ్వు మోసగాడివి! దగాకోరువు! అవకాశవాదివి!' అన్నాడు గుక్క తిప్పుకోకుండా!

'అదేమిటి?' అన్నాను తెల్లబోయి.

'ఇదివరకు నువ్వేం చెప్పావు? నీకు తారాబలం మీద, గ్రహబలం మీద నమ్మకం లేదన్నావు. పంచాంగం చూస్తూ తిథి వార నక్షత్రాలు లెక్కపెట్టే వాళ్ళంతా కాలాన్ని వృథా చేస్తున్నారన్నావు. సెంటిమెంటు అన్నావు. పిచ్చి నమ్మకం అన్నావు అర్థమైన కూతలూ కూశావు. ఇప్పుడు నువ్వు చూస్తున్నది పంచాంగం కాదా? నువ్వు చేస్తున్నది మీనమేషాలు లెక్కపెట్టడం కాదా?'

అతని ధోరణికి నాకు కోపం వచ్చిన మాట నిజమే! అయినా కొంచెం తమాయించుకొని 'నీగోడ వేదో నీదేకాని నా మాట వినవేమిటి?' అన్నాను.

'వినను! ఎంతమాత్రం వినను! నువ్వు అభ్యుదయ వాదివి అని మనవాళ్ళంతా అనుకుంటున్నారు. నీ కథా, నీ పంచాంగం కథా కనిపించిన వాడికల్లా చెబుతాను — నువ్వు అభ్యుదయవాదుల్లో 'రివిజనిస్టు' వని వూరూవాడా పబ్లిసిటీ యిస్తాను. నీకు పోటీ పార్టీ పెట్టిస్తాను.'

జేబులో డబ్బులులేక నిరుత్సాహంతోవున్న నా మీదికి 'పులిమీద పుట్ర' లాగ గోపాలం వచ్చాడు.

తన్ని గెంటేద్దామన్నంత కోపం వచ్చింది. కాని కొన్ని వ్యవహారాలలో గోపాలం చాలా గొప్పవాడు కనక మంచి మాటలతో అతని అపోహ తొలగించక తప్పలేదు.

'గోపాలం నేను పంచాంగం చూస్తున్న మాట నిజమే. ఒప్పుకుంటున్నాను.' అన్నాను.

ఇదే మరొకళ్ళయితే నామాటకు కొంత మెత్తబడి వుండేవాడు. కాని గోపాలం అలాంటి బాపతు కాదు.

'ఎవడికోసం ఒప్పుకుంటావు?' అన్నాడు ముఖంమీద గుద్దినట్టు.

'మా యింటి యజమాని రామ్మూర్తి నీకు తెలుసుకదూ?'

'ఎందుకు తెలియదూ? ఈ మహాపట్నం మొత్తంమీద డబ్బున్న పదిమందిలోనూ ఒకడు. లాభం కోసం ఎంత తక్కువరకం వ్యాపారం అయినా చేయించగల సమర్థుడు. మున్సిపల్ కౌన్సిలర్. అందమైన ఆడవాళ్ళన్నా - కుక్కపిల్లలన్నా - పబ్లిసిటీ అన్నా అతనికి మహా మోజు- అతని పేరు రెండుసార్లు నువ్వు పేపర్లో వేయించావు కనక నువ్వంటే అతనికి యిష్టం!'

క్షణంలో రామ్మూర్తిగారి రేఖాచిత్రం గీసి చూపించాడు గోపాలం.

గోపాలం! నువ్వు ఎంత తిట్టినా నాకు రామ్మూర్తి అవసరం చాలా వుంది. నాకు డబ్బు ఎప్పుడు కావలిసి వచ్చినా అతను సర్దుతాడు. లేదని అనడు. అతనికి బోల్డు వ్యాపకాలు వున్నాయి. నాకు అవసరమైనప్పుడు యింటిలో దొరకడు. అందుకే నేను పంచాంగం కొనుక్కోవలసి వచ్చింది' అన్నాను.

'ఏడిసినట్టేవుంది. అతను ఇంట్లో దొరక్క పోవడానికి - నువ్వు పంచాంగం కొనడానికి సంబంధం ఏమిటి? నువ్వు చెప్పిన దానికి కాడూ బొంగరం ఏమైనా వుందా?'

'ఉంది. సంబంధం వుంది. కనకే కొన్నాను. రామ్మూర్తికి తిధి వార నక్షత్రాలమీద చాలా నమ్మకం వుంది. మంచి రోజున మంచి ముహూర్తంలో అతనెప్పుడూ ఇంటి దగ్గర దొరకడు. ముఖ్యమైన పనుల మీద వెళ్ళిపోతూ వుంటాడు. నాకు డబ్బు అవసరమైనప్పుడు నేను తప్పకుండా పంచాంగం తెరిచి చూడవలసిందే. తిథి మంచిది కాని రోజున దుర్ముహూర్తంలో వెళ్ళితేనె నాకు రామ్మూర్తి దర్శనం అవుతుంది. లేకపోతే ఆయన దర్శనం అవదు సరికదా! రానూ పోనూ రూపాయి ఖర్చవుతుంది. నేను పంచాంగంచూడ్డానికి కారణం యిప్పటికైనా తెలిసిందా?' అన్నాను.

'అందరూ మంచి ముహూర్తాల కోసం పంచాంగం చూస్తే నువ్వు దుర్ముహూర్తాలకోసం చూస్తావా? ఇది నమ్మ వలసిన మాటేనా?' అన్నాడు.

వెంటనే నేను అతని చేతిలో పంచాంగం లాక్కొని 'ఇదుగో,



చూడు! ఈవేళ ఆదివారం, అమావాస్య. వర్షం నాలుగున్నర నుంచీ వుంది — ఇప్పుడు టైమెంతయింది?' అన్నాను.

'ఐదు' అన్నాడు.

'అంటే యిప్పుడు మంచి దుర్ముహూర్తమన్నమాట! — పద! రామ్మూర్తిగారి యింటికి వెళదాం. నా పని అవుతుంది నీకు రుజువూ దొరుకుతుంది.'

'అయితే తప్పకుండా చూడవలసిందే. కానీ నేను నీ దగ్గరకి మరో అర్జంటు పనిమీద వచ్చాను' అన్నాడు. 'ఆ పని తరవాత చూద్దాం, ముందు నడు.' అన్నాను.

ఇద్దరం కలిసి రోడ్డెక్కాం. గోపాలం చుట్టూ ఒక్కసారి చూసి 'వెధవ్వూరు! ఒక్క టాక్సీ కనపడదు. ఉన్న టాక్సీలన్నీ రైలు స్టేషను దగ్గరే తగులబడతాయి' అన్నాడు.

'నీ జేబులో ఏ మాత్రం డబ్బుంది?' అన్నాను.

'డబ్బా ? — డబ్బుకేముంది ?' అన్నాడు. అంతే కాని తన జేబులో డబ్బు లేదని మాత్రం ఒప్పుకోలేదు.

అసలు గోపాలం స్వభావమే అంత. తన జేబులో కనీసం పది పైసలు లేకపోయినా—పది లక్షల ఆసి పరుడిలా కనిపిస్తాడు. ఇలాగే మాట్లాడతాడు అతని ముఖంలో నిరుత్సాహం అన్నది కనిపించదు. ఎంతటి పిసినిగొట్టునయినా, పరమ కర్కోటకుణ్ణయినా మాటలతో యిట్టే బోల్తా కొట్టించెయ్యగలడు అలాగని అంతపెద్ద మహా మేధావి అనుకోగలరు. కొన్నిరంగాలలో ఉత్తఅమాయకుడు. పైపైమాత్రం తెలియని వాడిలా కనిపించడు నాటకం, నృత్యం, సంగీతం, సినిమా, చిత్రలేఖనం- మీరు దేని గురించయినా మాట్లాడండి వెంటనే అతను కలగజేసుకొని- లేదా మిమ్మల్ని మాటమధ్యలోనే ఆపుచేసి- ఆ యా కళల మీద తన అమూల్యాభిప్రాయాలు తెలియచేసి—మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చెయ్యగలడు. అతను పత్రికారచయితలలో పత్రికారచయిత, నటులలో నటుడు, కవులలో కవి, సినిమాప్రొడ్యూసర్లలో ప్రొడ్యూసర్, యిన్ని రంగాలలో యీవిధంగా చెలామణీ కాగలిగిన వాణ్ణి నేనయింతకుపూర్వంఎక్కడా చూళ్ళేదు.

పదిమంది చేరి ఒక సమాజం పెడితే దానిలో గోపాలానికి తప్పకుండా ఒక స్థానం వుంటుంది. ఒకవేళ సదరు సమాజంవాళ్ళు యితనిని వర్తించుకోకపోయినా— యితనేమూరుకోడు. తనంతటతానే ప్రవేశం సంపాదించుకోగలడు. ఈ పట్నంలోని ప్రతి సాంస్కృతిక సమాజతోను గోపాలానికి అంతో యింతో సంబంధం వుంది. అలాగని గోపాలం చాలా పలుకుబడి కలవాడని మీరు అనుకోగలరు. ఇతను అడుగుపెట్టిన ప్రతి సమాజంలోను సంవత్సరం తిరక్కుండా పేచీతెచ్చుకోవడ. — యిసకలకు రావడం జరుగుతూ వుంటాయి. 'ఇతను ఏసమాజంలోనూ నప్పకపోవడానికి కారణం యేమిటి?' అని మీరు అడగవచ్చు. కానీ అతనికీ నాకూ మైత్రీ సంబంధాలు తెగిపోకుండా వుండాలంటే నేను జవాబు చెప్పకూడదు.

నాలుగు అడుగులు ముందుకు వేసేసరికి మాకు "సరసు" ఎదురొచ్చాడు. వస్తూనే గోపాలాన్ని నిలదీసి "ఏమిటి మహానుభావా? ఎక్కడా దర్శనాలు లేవు" అన్నాడు.

'ఈ మధ్య వూళ్ళోలేను. నిన్నే బొంబాయి నుంచి తిరిగొచ్చాను.— మళ్ళా కలుసుకుందాం!' అని గోపాలం అతన్ని వదిలించుకోబోయాడు.

"మీకు పనిలేని దెవ్వుడు? నామాటకు మర్యాదగా జవాబు చెప్పి వెళ్ళండి" అన్నాడు సరసు సీరియస్‌గా! "ఏం జవాబుకావాలి? కోపంతో అడిగాడు గోపాలం.

## అంగార స్వప్నం

"అదే! మన పుస్తకం ఎందాకా వచ్చింది?"

"ఇంకేం తో లేదు. కొనకొచ్చేసింది. ఇప్పుడు అచ్చు ఆఫీసులో వుంది. తర్వాత మాట్లాడదాం. వస్తాను." తిరిగి తప్పించుకోడానికి ప్రయత్నించాడు. కానీ సరసు జీడిలా పట్టుకొని వదలలేదు.

"ఏ అచ్చాఫీసు?" అన్నాడు.

"పట్నంలో — ఎంత ఖర్చయినా అక్కడే వేయించాలి ప్రెస్సుకు రెండువందలు అడ్వాన్సు యిచ్చాను. టైటిల్ పేజీకి మరో రెండువందలు యిచ్చాను. డబ్బుచాలేదు. — వచ్చే వారం జనరల్ బాడీ సమావేశం వుంది మీ అందరికీ ఇన్విటేషన్ వస్తుంది. తప్పకుండా రండి." — అంటూ గోపాలం ముందడుగు వేశాడు. రెండిళ్ళు దాటిన తరువాత వెనక్కి తిరిగి చూశాను సరసు అక్కడే నిలబడి వున్నాడు.

ఇక్కడ సరసు గురించి రెండు మాటలు చెప్పడం అప్రస్తుతంకాదనుకుంటాను. "సరసు" అన్నది కలం పేరని మీరు యీ సరికి తెలుసుకుని వుంటారు. మొదట అతని కథలు చాలా పత్రికలలో కనిపిస్తూ వుండేవి. "సరసు అంటే రచయిత్రి అనుకొని అతని కథల్ని పత్రికలు ప్రచురించేవి" అని కిట్టనివాళ్ళంటారు.

నాకు సరసు ఎదురయినప్పుడు 'శ్రీశ్రీ' సూక్తి జ్ఞాపకం వస్తూ వుంటుంది. 'కదిలేదీ కదిలించేదీ కవిత్వం' అన్న సిద్ధాంతాన్ని సరసు ఒకసారి రుజువు చేశాడు. ఇతను రాసిన ఒక శృంగార కథ కొందరు పాఠకులను కదిలించి కోర్టుకు తీసుకు వెళ్ళింది — అంతేకాక యితని కథ పత్రికలో ఎప్పుడు అచ్చుపడినా — సదరు సంపాదకులకు దేశంలోని ఏదో ఒక మూలనుంచి ఉత్తరం వస్తూ వుండేది. ఈతని రచన ఫలానా భాషలో ఫలానా రచనకు అనుసరణ అనో - లేకపోతే మక్కికి మక్కి కాపీ అనో ఆ ఉత్తరాల సారాంశం.

ఇవేకాక యింకా అనేక కారణాలవల్ల 'సరసు' రచనా రంగంలోంచి నిష్క్రమించి ప్రస్తుతం అజ్ఞాతవాసంలో వున్నాడు. ఈ బాపతు ఫెయిల్యూర్ కథకులను కొందరిని చేరదీసి — వాళ్ళదగ్గరే డబ్బు వసూలుచేసి ఒక ప్రచురణ సంస్థ ప్రారంభించాడు గోపాలం. కథకుల జాబితాలోంచి నా పేరు ఎందుకో తొలగించారు కనక నాకా సంస్థలో చేరవలసిన బెడద తప్పిపోయింది.

ఇక్కడ చిత్రమేమంటే—గోపాలం యింతవరకూ ఆకథ సంపుటి అచ్చుకు యివ్వలేదు. మరి:నూలు చేసిన దబ్బంతా యేమయిందంటారా? దానికి జవాబు భవిష్యత్తే చెప్పాలి.

'ఏమండోయ్ గోపాలంగారూ! ఎక్కడా... కనిపించడమే మానేశారు!'

ఎదురుగా శంకర్ కనిపించాడు. శంకర్ అంటే ఉత్తర హిందూస్తానీ వాడు అనుకోగలరు. ఆధునిక పత్రికా సాహిత్యంలో కనిపించే ఒక సజీవ పాత్ర శంకర్

శంకర్ని చూడగానే గోపాలం ముఖభంగిమలో రవంత మార్పు వచ్చింది. అయినా మామూలు ధోరణిలో 'ఈ మధ్య వూళ్లో లేను,' అన్నాడు.

'అందులో కొత్త యేముంది? మీరు ఏదైనా బ్రహ్మాండమైన ప్రోగ్రాం జరిపించిన తరవాత కొన్నాళ్ల పాటు అజ్ఞాత వాసం చేస్తారు.' అన్నాడు శంకరం.

'అజ్ఞాతవాసం చెయ్యవలసిన ఖర్మ నాకెందుకొస్తుంది? — కొద్ది రోజులు రెస్టు — అంతే — వస్తాను. తర్వాత కలుసుకుందాం' అంటూ గోపాలం అతన్ని తప్పించుకో బోయాడు.

'తర్వాత కలుసుకోవలసిన పని నాకేంలేదు. ముందు అడిగేదో


లివర్ వ్యాధియా?
ఇందుకు తగిన చికిత్స
జమ్మివారి
లివర్ క్యూర్



బిడ్డల యొక్క లివర్ మరియు స్ప్లీన్ వ్యాధులకు ప్రఖ్యాత ఔషధము.

జమ్మి వెంకటరమణయ్య & సన్స్, మద్రాస్-4.
బ్రాంచీలు బెంగుళూరు-2; కుంబకోణం;
తిరుచిరాపల్లి-2. హైదరాబాద్-20

యిక్కడపెట్టి — నిక్షేపంగా — వెళ్ల వచ్చు." అన్నాడు శంకరం

"ఎకౌంట్లుతేలగానే యిచ్చేస్తాను."

"అసలు మీ ఎకౌంటు తేలడం అంటూ వుంటుందా?"

"అది తా అనవసరం. నీకావలిసింది డబ్బు—రెండు రోజుల్లోవచ్చి పట్టుకు పో!—అంతే!"

శంకరాన్ని తప్పించుకొని ముందుకు నడిచాడు గోపాలం దారిలో అడిగాను "అతనికి నువ్వెందుకు డబ్బివ్వాలి?"

"అదంతా ఒక తమాషా!—వాడికి తానొక గొప్ప గాయకుణ్ణని నమ్మకం,— అమధ్య నేను సినిమా తారలతో "నాట్య పదర్శనలు" ఏర్పాటు చేయించాను చూశావూ — అప్పుడు శంకర్ నాదగ్గరకొచ్చి — సంగీత దర్శకత్వం తనకు యిప్పించమని ప్రాధేయపడ్డాడు. సరేలే చూద్దాం. అన్నాను కానీ నన్ను వదలేదు అంతలో నాకు ఐదువందలు అర్జంటుగా కావలసి వచ్చాయి ముందు డబ్బిస్తేగాని హాలు రిజర్వు చెయ్యనన్నాడు ప్రొప్రయిటర్. అప్పుడు మరో దారిలేక శంకర్ దగ్గర ఐదు వందలు అప్పు పుచ్చుకొన్నాను." అన్నాడు గోపాలం

"పోనీ సంగీత దర్శకత్వమైనా శంకర్‌కు దక్కిందా?"

"వాడితలకాయ వాడి బతుక్కి సంగీత దర్శకత్వం ఒకటా?"

"అతను సంగీతం తెలిసిన వాడే కదా?— అమధ్య సినిమాల్లోకి కూడా పోయివచ్చాడు"

"అదంతా ఒక ఫార్సలే — రెండువేలకు పైగా పట్టుకొని పట్నం వెళ్లాడు.— అందరి చుట్టూ తిరిగి ప్రాధేయపడితే చివరకు ఒక ఛాన్సు దొరికింది అదయినా ఏమిటనుకున్నావు? — వీడేం పాట పాడక్కరేదు. — ప్రఖ్యాత నేపథ్యగాయని ఒకామె ఓ పాట పాడుతూ వుంటే — వీడు మధ్యలో — అహా! అహా! — ఓహో! — ఓహో! "అని రాగం తీయడం. వీడు తీసే రాగంలో "కుయ్యో మొర్రో!" లాంటి అరుపులూ కూతలూ మినహాయిస్తే పాటే లేదు. రెండువేలూ అయిపోగానే వెనక్కి వచ్చేశాడు ఇప్పుడు మన బస్తీ మొత్తానికి శంకర్ ఒక్కడే సంగీత దర్శకుడు. బోధపడిందా?" అన్నాడు హేళనగా గోపాలం.

---

- *"ఏంవోయ్ మైడియర్ షేక్స్పియర్! మొహం వేళ్ళాడేశావ్?"*

  *"ఏముంది? మా ఆవిడా నేనూ దెబ్బలాడుకున్నాం. రెణ్ణెల్లదాకా రాననిచెప్పి పుట్టింటికి పోయింది."*

  *"నీకే మంచిదిగా?"*

  *"ఇవాళ్టికి రెణ్ణెల్లు అయిపోయిందోయ్ బాబూ."*

నాకు శంకరంమీద జాలి కలిగింది. పాపం! అతని బలహీనత కనిపెట్టి చాలా మంది అతని దగ్గర డబ్బు కాజేస్తున్నారు. — అతనికి ఒక కళ మీద వున్న అచంచల విశ్వాసం కూడా నన్ను కదిలించింది.

తిన్నగా మాకు ఎదురువస్తున్న షావుకారు నరసయ్యను చూడగానే గోపాలం 'ఏమిటి? యివేళ అన్నీ దుశ్శకునాలే వస్తున్నాయి!' అని విసుక్కున్నాడు.

అంతలోనే నరసయ్య 'ఏమయ్యోయ్! గోపాలం ఇంక ఆ సొమ్ముకి నీళ్ళధారేనా?' అన్నాడు సమీపిస్తూ.

'నీళ్ళధార యెందుకు? నిక్షేపంగా పట్టుకుపోవచ్చు!' తేలిగ్గా జవాబు చెప్పాడు గోపాలం.

'ఏ దగ్గరేముంది పట్టుకుపోడానికి?— రొక్కానికి రొక్కం లాగే కావు.— మాకు క్రోత్తి బుట్టలో వేసి మా అచ్చాఫీసులో పన్నిండొందలు అరువెట్టావు' అన్నాడు నరసయ్య ఆయాసపడుతూ!

'పన్నెండు వందలకీ పూచీ నాది కాదు. అది అసోసియేషన్ వాళ్ళ బాధ్యత! నేను సెక్రటరీ పదవికి రాజీనామా యిచ్చేశాను —యిప్పుడున్న సెక్రటరీకి నోటీసు యివ్వండి — మీ దగ్గర పుచ్చుకున్న రెండువేలు మాత్రం నేను యిచ్చేస్తాను'

'నువ్వు యివ్వడం—నేను పుచ్చుకోడమూను! —యీ రెండూ జరిగేవేనా అంటూ!— డబ్బు నీకు తోచినప్పుడు యిద్దూగాని— ముందు ఒక నోటు రాసియ్యి.— అది ఎంత చప్పున చేస్తే అంతమంచిది.' అన్నాడు నరసయ్య

'అలాగన్నారు. బావుంది, రేపు వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను.'— అంటూ ప్రరోగమించాడు గోపాలం.

మేం బస్సులో రామ్మూర్తిగారి యిల్లుచేరుకోనేలోగా చిన్న చిన్న సంఘటనలు కొన్ని జరక్కపోలేదు. అయినా అవి చెప్పుకోతగ్గవి కావు.

అంతపెద్ద భవనంలో కేవలం నలుగురేవుంటున్నారని నేను చెప్పినప్పుడు గోపాలానికి సృష్టికర్తమీద చాలా కోపం వచ్చింది.

'చూడు, మనలాంటి వాళ్లం ఒకొక్క గదిలోనూ నలుగురం యిరుక్కు ఛస్తున్నపుడు—పాతిక గదులున్న యిలాంటి మేడలో కేవలం నలుగురు వుండడం — స్వార్థం—ద్రోహం!' అన్నాడు గోపాలం.

'నిజమే! నేనూ ఒప్పుకుంటాను. రామ్మూర్తికి ఒక సిద్ధాంతంగాని — ఒక పార్టీ గానీ లేవు. కనక అతనికి స్వార్థం వుండడంలో మనం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. — మరి పెద్ద పదవుల్లో వుంటూ — త్యాగాల గురించి మాట్లాడే మన రాజకీయ వేత్తల ఐశ్వర్యం మాటేమిటి?—మనం యీ యింట్లోకి వెళ్లి పని పూర్తిచేసుకొని తిరిగి వచ్చేవరకూ స్వార్థం గురించి మాట్లాడకు — ఆ తరువాత

నీయిష్టం—తెల్లవార్లూ మాట్లాడుదు
వు గానీ" అన్నాను.

ఇంద్రభవనంలా వున్న ఆ మేడలో అడుగు పెట్టేసరికి గోపాలానికి మతి పోయినంత పని జరిగింది. ఒకమునిసిపల్ కౌన్సిలర్ యింట్లో—రకరకాల నాట్యభంగిమలలో వున్న చిత్రాలు కనిపిస్తాయని అతనెప్పుడూ వూహించివుండడు. గోడల మీదవున్న చిత్రాలనుపరిశీలిస్తూ హాలులో తిరుగుతున్నాడు. నేను అక్కడే కుర్చీలో కూర్చుని గోపాలం ధోరణి గమనిస్తున్నాను. —అతను హాలు చివరకు వెళ్లేసరికి ఒక అల్సేషియన్ కుక్క —యిలు ప్రతిధ్వనించేలా మొరుగుతూ—అతనికి ఎదురు వచ్చింది. కళ్ళుమూసి తెరిచేసరికి—ఆ కుక్క నాలుగుకాళ్ళూ పైకెత్తి గోపాలం మీదికి దూకడం—నౌకరువచ్చి కుక్కను పట్టుకు పోవడం రెండూ జరిగాయి. ఈ సంఘటనతో గోపాలంలోని కళాభిమానం తాత్కాలికంగా ఆగిపోయింది. అతనికి స్వల్పమైన గాయం తగిలింది.

"ఇప్పుడు నాకు రోజులేం బాగా లేవు" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ గోపాలం.

"కుక్క కరిచినంత మాత్రాన రోజులు చెడిపోతాయా?" అన్నాను.

"అది కాదు. జనవరి వరకూ నాకు తారాబలం అనుకూలంగా లేదు. ఈలోపున నేను ఏపని చేసినా ఆటంకాలు వస్తాయి" అన్నాడు.

"పిచ్చినమ్మకం!"

"అలా కొట్టి పారెయ్యడానికి వీల్లేదు."

"తారాబలం సరిగ్గా లేదని పనంచేసే పనుల్ని వాయిదా వేసుకోవడం పిరికితనం, తెలివితక్కువకూడా.—యీ దేశంలో జన్మ నక్షత్రం తెలియని మనుషులు ఎన్ని కోట్లమంది వున్నారో నువ్వెప్పుడైనా వూహించావా?"

"అది వాళ్ళ దురదృష్టం" అన్నాడు గోపాలం తడుముకోకుండా. "అది దురదృష్టం కాదు, అదృష్టం!"

"ఎందుకని?"

"జన్మ నక్షత్రం తెలియదు కనుక వాళ్ళకు కాలాన్ని వృథా చేసుకోవలసిన అవసరం వుండదు. మీనమేషాలు లెక్కపెడుతూ — చెయ్యవలసిన పనుల్ని వాయిదా వేసుకుంటూ— రాబోయే మంచిరోజుల కోసం ఎదురుచూస్తూ కూర్చోవలసిన అవసరం వాళ్ళకులేదు."

"గ్రహబలం సరిగా లేనప్పుడు

---

● "ఆవిడకెన్నేళ్ళుంటాయంటావ్ ?"

""అసలు యాభై. నలభైఏళ్ళదానిలా కనిపిస్తుంది. ముప్ఫయ్యేళ్ళని తను అనుకుంటుంది. ఇరవయ్యేళ్లదానిలా ముస్తాబు చేసుకుంటుంది. పదేళ్ళ పిల్లలా ప్రవర్తిస్తుంది.""

చేసిన ప్రతిపనీ దెబ్బతింటుంది.— కావాలంటే పరీక్ష చేసిచూడు.' అన్నాడు

అదే సమయంలో తిన్నగా వున్న డోర్ కర్టెన్ తొలగించి— శ్రావ్యమైన కంఠస్వరంతో 'ఓ! మీరా!— మీరు వచ్చి ఎంతసేపు అయింది?' అంది తెలుగు సినిమాలోని స్త్రీపాత్ర లాంటి ఓనవయసావని!

'మేం యిప్పుడేవచ్చాం!—మేం రాగానే మీ కుక్క వచ్చి మమ్మల్ని పరామర్శించి వెళ్ళింది.' అన్నాను.

'లిలీకి మీరు తెలుసు!— అది మీ జోలికిరాదు!'

'కానీ మా గోపాలాన్ని అది ఎరుగదు కదా?' అన్నాను నవ్వుతూ!— ఆ మెముఖంలో మార్పు కనిపించింది. వెంటనే 'మీనాన్నగారు లేరా శ్యామలా?' అన్నాను.

'ఉన్నారు. నాన్నగారితో చెప్పి వస్తాను.' లోపలికి వెళ్ళి పోయింది శ్యామల.

'రామ్మూర్తిగారి అమ్మాయేనా?' నెమ్మదిగా అడిగాడు గోపాలం.

'అవును.'

'చాలా చక్కటి విగ్రహం!' మెచ్చుకున్నాడు.

'నువ్వు కొద్దిక్షణాలపాటు విగ్రహాలనుగురించి— పర్సనాల్టీ గురించి మాట్లాడ్డం మానెయ్యాలి!' అన్నాను సీరియస్‌గా.

'ఇంతటి చక్కని చుక్కను చూస్తూ మెచ్చుకోకుండా ఎలావుండగలను?'

'మన దేశంలో పరాయిస్త్రీల అందాన్ని మెచ్చుకోవడం వంటికి అంత మంచిదికాదు.' అన్నాను.

'కొన్ని విషయాలలో నువ్వు శుద్ధ పూరాతకాలంమనిషివి' కోపం వచ్చిం గోపాలానికి— అయినంతలో గా ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా "ఆగు! ఆగు! రామ్మూర్తి పెళ్ళాన్ని వదిలేశాడు కదా!— మరి ఈ యింటిలో వున్న ఆవిడ ఎవరూ!— ఇప్పుడు కనిపించిన చిన్నది ఎవరి కూతురు?" నన్ను నిలదీసి అడిగి తెలుగు సినిమాలోని డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌లా పోజు పెట్టాడు.

అతని ధోరణి నాకు నచ్చలేదు. "వాళ్ళ యింట్లో కూర్చుని వాళ్ళ కళంకంగురించే మాట్లాడుకోవడం చాలా దారుణం. అనాగరికం!— అమర్యాద!" అన్నాను.

"మనుషులలోని కల్మషాన్ని— పైకితీసి చూపించడానికి కలంపట్టిన— నీలాంటి రచయిత అనవలసిన మాట కాదని!" ముఖంమీద కొట్టినట్టు జవాబు చెప్పాడు.

"ఇక్కడ నువ్వు యిదే ధోరణిలో మాట్లాడితే విగ్రహాలవల్ల కలిగే చెడ్డఫలితాలను — నీతోపాటు నేను కూడా అనుభవించవలసివుంటుంది."

నేను విగ్రహాల ప్రసక్తి తీసుకు రాగానే గోపాలం అగిపోయాడు. రామ్మూర్తి పట్ల గోపాలానికి

కలిగిన అనుమానంలో నిజం లేక పోలేదు. పెద్ద బంధువంతంగా కట్టి పెట్టిన భార్యను విడిచిపెట్టి యిరవై యేళ్ళనుంచీ రామ్మూర్తి యీ దరి తోనే వుంటూ — 'జీన్‌పాల్ సార్త్రే' సిద్ధాంతాలలో ఒకదాన్ని అమలు జరిపాడు. ఆ దంపతులకే శ్యామల — ఆ వయస్సులో వున్న అందరు పిల్లల లాగే శ్యామలకు అలంకరణ మీద మోజు ఎక్కువ. ఆమెలో అందం కంటే ఆకర్షణే హెచ్చు — ఎన్నడూ ఏ బెంగా ఎరగని రామ్మూర్తికి — యిప్పుడు పట్టుకున్న బెంగ 'యీ అమ్మాయికి పెళ్ళి చేయడం ఎలాగ!' అన్నది. ఈ ప్రసక్తి లోగడ మాయిద్దరి మధ్యా ఒకసారి వచ్చింది.

'ఈ రోజుల్లో — ఎవరో కొందరు రాజకీయ వేత్తలు మినహాయించి - కులంగురించి పట్టించుకొనే వాళ్ళు ఎవరూ లేరు — ఆ రాజకీయ నాయకులైనా — కేవలం వోట్లుకోసం — ఎలక్షన్లకోసం — పదవుల కోసం మాత్రమే కులవ్యవస్థను చచ్చిపోకుండా కాపాడుతున్నారు. మీ శ్యామలవంటి అందమైన అమ్మాయికి పెళ్ళవడం యీరోజుల్లో కష్టమైనపనేం కాదు. వర్ణాంతరవివాహాలు చేసుకున్న వాళ్ళ పిల్లలకు ఎంతమందికి పెళ్ళిళ్ళు కావడం లేదు!'

నా మాటలకు రామ్మూర్తి సంతోషించాడు. నేను చెప్పింది నిజమే అనుకుంటూ ఒప్పుకున్నాడు.

శ్యామల వెనక కొంతమంది యువకులు తిరుగుతున్నారని మొదట తెలిసినప్పుడు రామ్మూర్తికి సంతోషం — భయం కూడా కలిగాయి. శృతిమించిన ఒక కేసులో రామ్మూర్తి — ఒక రోమియోకి దేహశుద్ధి చేయించడం కూడా జరిగింది. రామ్మూర్తి చేతిలో డబ్బుంది.

ఊళ్ళో ప్రతి వార్డుకు ఒకయిల్లు వుంది. సంతపేట దగ్గర్నుంచి — బస్ రూట్లువరకూ బోల్డు వ్యాపారాలలో లక్షలకొద్దీ రూపాయలు నిత్యం ప్రవహిస్తూ వున్నాయి. — పూర్వం ఈస్టిండియాకంపెనీ వాళ్ళు వ్యాపార రక్షణకోసం సైనికుల్ని పోషించినట్టు రామ్మూర్తికూడా కొంతమంది రౌడీలను జాగర్త చేసి వుంచాడు. ఎన్నికలలో నిలబడే ప్రతి పెద్దమనిషీ రామ్మూర్తి సహాయాన్ని అర్థించడం రివాజు. రామ్మూర్తి బలపరచిన అభ్యర్థి గెలవడం తథ్యం.

రామ్మూర్తికి వున్న యిళ్ళలో—

---

● *'ఇదుగోనోయ్ నీకు పుట్టినరోజు కానుక.'*

*'ఏమిటిది?'*

*'ఉత్తరాలు చింపుకునేందుకు స్టెయిన్ లెస్ స్టీల్ కట్టర్.'*

*'మా ఆవిడుండగా ఇంకా ఇది దేనికోయ్.'*

ఒక యింట్లో ఒక భాగంలో నేను అద్దెకు వున్నాను. పట్నాలలో చీటికి మాటికీ యిళ్ళ అద్దెలు పెరుగుతూ వుండడం అందరికీ తెలిసిన సంగతే — కానీ నా విషయంలో అందుకు వ్యతిరేకంగా జరిగింది — నా మీద అతనికి ఎందుకు సదభిప్రాయం కలిగిందో తెలియదు. నేను అద్దె యివ్వడానికి వెళ్ళినప్పుడు కబుర్లలోకి దించి చాలా సేపు కూర్చోబెట్టేవాడు. సంవత్సరం తిరిగేసరికి నేను యివ్వవలసిన అద్దె సగానికి సగం తగ్గిపోయింది.

ఈ మహా పట్నంలో అవసరానికి అప్పు పొందడం చాలా కష్టం — రామ్మూర్తి వల్ల నాకు ఆ యిబ్బంది కూడా తొలగిపోయింది. నేను ఎప్పుడు డబ్బు అడిగినా ఆయన లేదనకుండా యిచ్చేవాడు. — కానీ యిందులో మరో చిక్కు కూడా ఎదురయ్యేది. ఆయనకు అనేకంగా వ్యవహారాలున్నందువల్ల నేను వెళ్ళినప్పుడు ఆయన యింట్లో వుండేవాడు కాదు.

'ఆయన యింట్లో ఏ సమయంలో దొరుకుతారు? పనులమీద వెళ్ళే సమయాలు ఏవి?' అని ఒకసారి భార్యను అడిగాను. ఆమె కూడా సరైన సమాధానం చెప్పలేకపోయింది. వాళ్ళ నాన్నగారు పైకి వెళ్ళడానికి ప్రత్యేకించి వేళలంటూ ఏవీ లేవని చెప్పింది.

ఒకనాడు నేనూ రామ్మూర్తీ మాట్లాడుతున్న సమయంలో వాళ్ళ పురోహితుడు వచ్చాడు. రాబోయే వారం రోజుల్లోనూ వున్న మంచి తిథులు, సమయాలు — ఏ రోజున ఏ దిశకు వెళ్ళవచ్చో - ఏ దిశకు వెళ్ళకూడదో — వగైరా వివరాలన్నీ చెప్పి పురోహితుడు వెళ్ళిపోయాడు. ఆయన కేవలం పురోహితుడే కాదనీ — చిన్నప్పుడు కాశీ వెళ్ళి అన్ని శాస్త్రాలతో పాటు జ్యోతిశ్శాస్త్రం కూడా నేర్చుకువచ్చాడని - మూడు కాలాలకు సంబంధించిన జ్ఞానం క్షుణ్ణంగా తెలిసినవాడనీ — ఆయన పెట్టిన ముహూర్తాలకు తిరుగు లేదని — రామ్మూర్తి చెప్పాడు.

దానితో ఆయనకు తారాబలం మీద చాలా నమ్మకం వుందని తెలుసుకున్నాను. మొదటిసారి కేలండరు ఒకటి చూసి — దుర్ముహూర్తంలో రామ్మూర్తిగారి యింటికి వెళ్ళాను. తక్షణం ఆయన దర్శనం అయ్యింది.

దుర్ముహూర్తాలలో రామ్మూర్తిగారి దర్శనం దొరుకుతుందన్న సంగతి — నా అంతట నేనే కనిపెట్టాను. గ్రహబలం మీద నాకు నమ్మకం లేకపోయినా — నేను ఆ విషయంలో ఆయనతో ఎప్పుడూ వాదించలేదు. వాదించాలంటే నాకు ఆధారాలు లేకపోలేదు. లోగడ ఒకసారి ఆయన శుభఘడియలలో ప్రయాణమై వూరు వెళుతూవుంటే ఆయన కారుకు యాక్సిడెంటు అయ్యింది. మరొక ప్రయాణంలో

ఆయన చిన్న కూతురు చచ్చి పోయింది — శుభ ముహూర్తాలు ఎన్ని విఫలమైనా పంచాంగంమీద గౌరవం రవంతైనా తగ్గలేదు. సరి కదా రోజురోజుకూ పెరుగుతోంది.

"ఏమండోయ్! ఏమిటిసంగతి? —చాలా కాలానికి కనపడ్డారు" లావుగా పొట్టిగా వున్న ఓ విగ్రహం చిరునవ్వుతో ప్రశ్నించింది

"మీతో కొంచెం పని వుండి వచ్చాను — మీరు పైకి వెళుతున్నారా?"

"అబ్బెబ్బే! లేదు! ఈ వేళ పనులేమీ లేవు. నిన్న పొద్దున్నే ఊరినుంచి తిరిగొచ్చాను." కుర్చీలో కూర్చుంటూ రామ్మూర్తి అన్నాడు.

నేను వచ్చిన పని తెలియజేసేను. ఆయన మారుమాటాడకుండా పర్సులోంచి నోట్లు తీసి నా చేతికి యిచ్చాడు.

"ఈ రెవరు?" గోపాలంకేసి చూస్తూ ప్రశ్నించాడు రామ్మూర్తి

'ఇతను నా స్నేహితుడండీ. గోపాలాన్ని మీకు యిదివరకే తెలిసి వుండాలి. అంచేత నేను పరిచయం చెయ్యలేదు.'

'ఎక్కడో చూసినట్టు గుర్తుంది.'

'ఒక కల్చరల్ ప్రోగ్రాంకు మీదగ్గర చందా పుచ్చుకున్నాను.' పాత సంగతి గుర్తుకు తెచ్చాడు గోపాలం.

'గోపాలానికి డాన్సు, డ్రామా, లలిత సంగీతం, చిత్రలేఖనం వగైరా కళలమీద చాలా అభిమానం — వాటికోసం నిత్యం ఏదో తాపత్రయం పడుతూవుంటాడు.'

'నాకు అందమైన బొమ్మలు, నాటకాలు, సినిమాలు తప్ప మిగిలిన వేవీ బోధపడవు అంచేత భరత నాట్యాలకు నేను చందా యిచ్చినప్పటికీ వెళ్ళి చూడను' దాపరికం లేకుండా చెప్పేశాడు రామ్మూర్తి.

వెంటనే గోపాలం అందుకున్నాడు. ఈ మధ్య గొప్ప గొప్ప వాళ్ళంతా కలిసి ఒక సినిమా తీస్తున్నట్టూ—దానికి తనే సారథ్యం వహిస్తున్నట్టూ-అదృష్ట జాతకుడితో ప్రారంభోత్సవం జరపబోతున్నట్టూ-ఇంకా ఎన్నో వివరాలు చెప్పాడు.

రామ్మూర్తి ముఖభంగిమలనుబట్టి అతనికి మొదట ఈ ప్రసంగం రుచించినట్టు కనిపించలేదు. కానీ గోపాలం తక్కువ వాడుకాదు. రామ్మూర్తిలో వున్న బలహీనతను పసిగట్టి... నెమ్మదిగా వల విసిరాడు.

'ఎప్పుడు మొదలు పెడతారు?' అడిగాడు రామ్మూర్తి

---

● *భర్త : "చూశావా, ఈ వ్యాసంలో రాశారు. తండ్రి ఎంత తెలివైనవాడైతే కొడుకు అంత మంద అవుతాట్ట."*

*భార్య : "అయితే మనఅబ్బాయికేం ఫరవాలేదన్నమాట."*

'జనవరి వెళ్ళేవరకూ నేనేమీ చెయ్యదలుచుకోలేదు ఉగాదినాడు ప్రారంభోత్సవం మీతోనే జరిపిస్తాను.' 'ఏమిటీ? నాతో జరిపిస్తారా?' 'నిజంగానే.' ఆశ్చర్యపోయాడు రామ్మూర్తి.

'అవును. మీతోనే--మీకంటే అదృష్టవంతు లెవరున్నారు? — మీరు చెయ్యి పెట్టిన ప్రతి వ్యాపారం తిరుగు లేకుండా అభివృద్ధిలోకి వస్తోంది. మీ హస్తవాసి చాలా మంచిది. ప్రారంభోత్సవానికి మీ పర్మిషన్ పుచ్చుకోడానికే నేనిప్పుడు వచ్చాను.'

ఈ చివరిమాట మాత్రం శుద్ధ అబద్ధం. దుర్ముహూర్తంలో రామ్మూర్తి దర్శనం అవుతుందా? కాదా? అన్నది తేల్చుకోడానికి మాత్రమే గోపాలం నాతో వచ్చాడు. ఇప్పుడు ప్లేటు మార్చాడు.

'ఈ ఊళ్ళో నాకంటే గొప్పవాళ్ళు—ఎక్కువ చదువుకున్నవాళ్ళూ ఎంతోమంది వున్నారు. వాళ్ళతో ప్రారంభం చేయించండి' అన్నాడు రామ్మూర్తి.

కానీ గోపాలం ఒప్పుకోలేదు. గొప్ప గొప్ప విద్వాంసులూ, పండితులూ ప్రారంభోత్సవాలకు పనికిరారన్నాడు. వాళ్ళ చేతులు మంచివి కావన్నాడు. వాళ్ళ చెయ్యి పడినంత మాత్రాన పచ్చగా వున్న సంస్థలు కూడా ఎండిపోతాయన్నాడు.

ఎలాగైతేనేం గోపాలం నెమ్మదిగా రామ్మూర్తిని — వూబిలోకి దించడం ప్రారంభించాడు. నేను వున్నానన్న సంగతి కూడా గుర్తించకుండా వాళ్ళిద్దరూ కొత్త వ్యాపారం గురించి ఉత్సాహంతో చర్చించుకుంటున్నారు. నేను గోపాలాన్ని యిక్కడికి తీసుకు రావడంలోని ప్రమాదాన్ని ఇప్పటికి గుర్తించాను. నా మీది నమ్మకంతో — నాతో వచ్చినవాడు తప్పకుండా పెద్ద మనిషి అయివుంటాడని రామ్మూర్తి అంచనా! అందేతనే గోపాలం మాటలకు అతను అంత విలువ ఇస్తున్నాడని నేను వూహించాను.— అయితే రామ్మూర్తిని ఈ ఉచ్చులోంచి విడిపించడం ఎలాగ? మనస్ఫూర్తిగా నమ్మిన వాళ్ళను— సునాయాసంగా దగా చెయ్యగల శక్తి నాలో లేదు కనక--యీ వ్యవహారం చాలా బాధాకరంగా వుంది-- అయిదు నిముషాల తరవాత యిద్దరికేసీ చూశాను. వాళ్ళ ఉత్సాహం క్షణక్షణానికి ద్విగుణీకృతం అవుతోంది.

అంతలో మా వెనక 'రామ్మూర్తి బాబూ!' అన్న బొంగురు గొంతూ-- కుక్క అరుపు — ఒక చిన్నదాని కేక కిలారవం— ఒక్కసారిగా వినిపించాయి.

రామ్మూర్తి నిదానించి చూసి 'ఏంవోయ్ జోగులూ! రా! రా!— ఏమిటి సంగతి?' అన్నాడు.

పెద్ద జుత్తు, కండలు తిరిగిన వళ్ళు,

గళ్ళ లాల్చీ, ఫిన్లే పంచె కట్టిన జోగులు నాకు తెలియనివాడు కాదు. ప్రకాశంతో వచ్చిన కుటిల కుంతల (చెడ అర్థం అయ్యేనేమో! మనవి, ఉంగరాల జుత్తు కలదని భావం) వసంత అంతకంటే తెలియనిది కాదు.

నన్ను చూడగానే వసంత మందగమనంతో (అంటే లావు పాటిది కాదు) చిరునవ్వుతో వచ్చి నా పక్కని కూర్చుని "మీరు యిక్కడున్నారేం?" అంది.

"రామ్మూర్తిగారిని నాకు బాగా తెలుసు అప్పుడప్పుడు యిక్కడికి వస్తూవుంటాను." సంజాయిషీ చెప్పుకున్నాను

ఈ రెండు పాత్రల ప్రవేశంతో గోపాలం ముఖంలో కళ తరిగిపోయింది. జోగుల్ని చూడగానే ముఖం చాటు చేసుకున్నాడు. ఎవరిని చూసినా చలించని గోపాలంలో ఈ మార్పేమిటి? దీని అర్థం ఏమిటి? అనుకుంటూ వుండగానే జోగులు గోపాలాన్ని పలకరించాడు. పైకి కిందికి చూశాడు.

"ఏమయ్యోయ్! పెద్దమనిషీ! ఇక్కడ చేరేవేంటి సంగతి?" అన్నాడు వ్యంగ్యంగా!

"చిన్న పనిమీద వచ్చానులే!-- ఈ మధ్య నీవెక్కడా కనపడ్డం లేదేం? బాగున్నావా?" అన్నాడు గోపాలం.

"ఏ మొకం పెట్టుకుని అడుగుతున్నావంట!— నీ కన్పడ్డాక నేను బాగోడం కూడానా? అసలు నువ్విక్కడ ఎందుకు చేరేవో సెప్పు రామ్మూర్తి బాబుని ఎందులోనైనా దించుతున్నావేంటి?"

"దించడం ఏమిటి?" కోపంతో అడిగాడు గోపాలం.

"దించడం అంటే ముంచడం అన్నమాట!" ఉరిమాడు జోగులు.

"ఏమిటోయ్ జోగులూ? ఏమిటిదంతా?" మందలించే ధోరణిలో అడిగాడు రామ్మూర్తి

---

● *మొగుడు రోజూ ఒక విస్కీ సీసా ఇంటికి తెచ్చుకుని పూర్తి చేసేవాడు. పెళ్ళాని కతని వరస ఏం నచ్చలేదు ఎన్నిసార్లు చెప్పినా అతనికి ఆ అలవాటు పోలేదు*

*ఒక రోజున పెళ్ళాం కోపం పట్టలేక అతని చేతిలో సీసా లాక్కుని కొద్దిగా రుచి చూసింది. నోరు భగభగ మండిపోయింది గొంతు పట్టుకుని అరగంటదాకా దగ్గుతూ నానా హడావిడీ చేసింది.*

*"చూశావా. నే నేదో ఇన్నాళ్లూ సరదాగా అనుభవిస్తున్నాననుకున్నావ్. ఇది తాగడం ఎంత కష్టమో తెలిసిందా?"*

'ఏం చెప్పమంటావ్ రామ్మూర్తి బాబూ!—మా చెల్లి తిలకం ఎంత మంచిదో యీ బాబు నడుగు!' అంటూ నన్ను చూపించాడు జోగులు.

ఆ ఆట వాళ్ళతో నీకేం పరిచయం అని మీ రడగొచ్చు. వాళ్ళంతా నాటకాలలో ఆడపాత్రలు—తిలకం, వసంత యిద్దరూ నాటకాలలో వేషాలు వేశారు. వసంత యిప్పటికీ వేస్తోంది.

'ఇప్పుడు మీ తిలకానికే మొచ్చింది?' అడిగాడు రామ్మూర్తి.

'దానికి పోయేకాలం వొచ్చింది. ఇదుగో! ఈ పెద్ద మనిషి దగా చేసి—దాని మనసు యిరిచేసి—వూరు దాటించేసి—సినిమాల్లో కలిపేసేడు.'

'ఇందులో చెడ్డేముంది? నాటకాలలో కంటే సినిమాల్లో ఎక్కువ డబ్బొస్తుంది కదా?' అన్నాడు రామ్మూర్తి

'అదిపోయి యేణర్థం అయ్యింది. ఒక్క సినిమాలోనూ దాని మొకం కనపళ్ళేదు. దాన్ని యితగాడు యే దగా కోరుకు అప్పగించాడో తెల్దు'

'ఇదుగో! జోగులూ! నువ్వు తొందర పడితే లాభంలేదు. మీ తిలకం యిప్పుడు తిలకంకాదు రేఖ! పేరూ మారిపోయింది — రేఖా మారిపోయింది. — కావాలంటే ఎడ్రస్ యిస్తాను. వెళ్ళి చూడు గుమ్మం ముందు గూర్ఖా, గుమ్మం లోపల గులాబీలు, ఇంటినిండా ఆర్టిస్టులు!— నువ్వు చూశావంటే ఆశ్చర్యపోతావు. చూసి మాట్లాడు!' ఆవేశంతో చెప్పాడు గోపాలం.

'నీ మాటలకి ఎవరైనా బోల్తా కొట్టొచ్చు. నేను మాత్రం కొట్టను. నన్ను కొట్టించలేవు'

'అవతలికి రా! అయిదు నిముషాలు మాట్లాడదాం!' పలవిసిరేడు గోపాలం.

'అయిదు నిమిషాలుకాదు ఐదు గంటలు మాటాడతాను— ఆగు! — నిన్ను చూడగానే నేనొచ్చిన పనే మరిచిపోయాను' అంటూ యింటి యజమాని కేసి తిరిగి 'రామ్మూర్తి బాబూ! మామాటేం చెప్పావు?' అన్నాడు.

'ఇప్పుడాని కేముంది జోగులూ! నేను కలగచేసుకుంటే పని అయిపోవలసిందే!'

జోగులు చాలా సంతోషించాడు. 'మీలాంటి మారాజులుండబట్టే యీ ప్రపంచకం యిలాగైనా నిలబడివుంది.' అన్నాడు.

'అయితే నాకు డాన్సుటీచరు ఉద్యోగం యిస్తారా అండి?' అంది సంతోషంతో వసంత.

'ఇస్తారా యేమిటి?—యిచ్చేసినట్టే! వారం పదిరోజుల్లో ఆర్డర్లొస్తాయి,' అన్నాడు రామ్మూర్తి

నేను లేచి 'రామ్మూర్తి గారూ!

సెలవు! మరోసారి వచ్చి కలుసుకుంటాను.' అన్నాను.

'మీతో చాలా సంగతులు మాట్లాడాలండీ' అన్నాడు రామ్మూర్తి.

'మీ కెప్పుడు తీరికో చెబితే వస్తాను' అన్నాను

'రేపు రాత్రి 8 గంటలకి తప్పకుండా రండి'

సరే అన్నాను. గోపాలం నన్ను అనుసరించాడు.

'ఏయ్ పెద్దమనిషి! ఎప్పుడెప్పు యిస్తానని యెళ్ళి పోతున్నావేంటి?' వెనకనుంచి గర్జన వినిపించింది.

'జేబులో లేదు. మా యింటి కొచ్చి పట్టుకు వెళ్ళు!' అంటూ వెనక్కి తిరిగి చూడకుండా గోపాలం నాతోపాటు వీధిలో పడ్డాడు.

'నీ మూలాన్ని తిలకం పాడై పోయిందంటాడేమిటి? నువ్వేం చేశావు?' గోపాలాన్ని అడిగాను.

'వాడి మాటలా నువ్వు నమ్మేవు? ఆ జోగులుగాడు వుత్త దొంగ వెధవ! వాడు ఆ యిద్దరు చెల్లెళ్ళమీదా ఆధారపడి బతుకుతున్నాడు. సోమరిపోతు! వీడు వాళ్ళను బాగుచెయ్యడు. వాళ్ళంతట వాళ్ళు బాగుపడాలనుకుంటే— వాళ్ళను బాగుపడనివ్వడు.— అది బాగుపడతానంది నేను దారి చూపించాను. చక్కగా రెక్కలు కట్టుకొని ఎగిరిపోయింది. మధ్యని విడికెందుకా దగ్గరే ఈ వూళ్ళో ఎన్నేళ్ళు వున్నా తిలక —తిలకంగానే వుండిపోతుంది. అదిదకు రేఖ మారే యోగం వుంది. స్వతంత్రించి వెళ్ళిపోయింది.

ఆకు మేఘాలమీద పరుగెత్తుతుంటూ వచ్చి ఒక జట్కాబండి మా ముందు ఆగింది. ఆశెరిపడి ముందుకు చూశాను. అసురుడు లాంటి ఆ రథసారథి నాకు తెలిసినవాడే? వాడికి రెండు కాళ్ళూ వంకర. మనిషి పొట్టివాడు. ఇవాళేమో చాలా దురుగ్గా వున్నాడు.

'అబ్బాయిగారూ! కొత్త గుర్రం కొన్నాను! ఎక్కండి! బండెక్కండి.' అన్నాడు చిట్టి.

నేను చదువుకునే రోజుల్లో చిట్టి గుఱ్ఱబ్బండిమీదే స్కూలుకు వెళ్ళే

---

● *ఇంట్లో వాటాని అద్దెకడిగిన ఆసామీతో ఇంటి యజమాని : "మీకు పెంపుడు కుక్కలున్నాయా?"*

*"లేవండి. ఏం?"*

*"ఏం లేదు. మాకు నాలుగున్నాయి. అవి అస్తమానం మొరుగుతూ వుంటాయి. వాటితోనే ఛస్తున్నాం ఇహ మీక్కూడా వుంటే భరించలేం. అందుకని"*

వాణ్ణి. చిట్టి ఒకటోరకం రౌడీ! పెద్ద మనుషుల్లో పెద్దమనిషి! పేచీ కోరుల్లో పేచీకోరు! వాణ్ణి చూస్తే అందరూ జడుస్తారు. వాడి ఆకారమే అలాంటిది! చింతనిప్పుల్లాంటి కళ్ళు! పెద్ద గిరజాల జుత్తు! లావుపాటి ముఖం, మైక్ అక్కర్లేకుండా అరఫర్లాంగు దూరం వినపడే గొంతు!— వాడంటే యెవరూ యిష్టపడరు

"కిరాయి యివ్వొద్దు! నా జేబు నిండా డబ్బులున్నాయి. మీరెక్కి కూర్చుంటే — సెంటర్లో గేలాప్ మీద తీసుకు పోతాను కొత్త గుఱ్ఱానికి ముందు బోణీ మీరే చెయ్యాలి. యెక్కండి!" చిట్టి అరుస్తున్నాడు, గుఱ్ఱం సకిలిస్తోంది

"ఎక్కడికి వెళ్ళవలిసిన పనిలేదు. ఇంటికి వెళ్ళిపోతున్నాను నీబండి మరోసారి..."

"నేనొప్పుకోను! మీరెక్కాలి. నేను బండితోలాలి. సాయంత్రం షికార్! ఊరవతలకు పోయి — యెనక్కి తోలుకొచ్చి యింటికాడ దిగబెట్టి యెళతాను."

నేనింకా సంశయిస్తున్నాను. గోపాలం బండి ఎక్కుతూ అన్నాడు. "ఇప్పుడు యింటికి వెళ్ళిమాత్రం యేంచెయ్యాలి? వాళ్ళు అంత సరదా పడుతున్నారు. కాస్సేపు షికారు వెళ్ళివద్దాం"

దాన్తో మారుమాటాడకుండా జట్కా యెక్కాను అప్పటికే బండిలో రెండు గ్రహాలు కూర్చుని వున్నాయి. మాటల ధోరణినిబట్టి వాళ్ళిద్దరూ గుర్రబ్బళ్ళవాళ్ళే అని, చిట్టి అనుచరులని అనుకున్నాను. మామూలు వేగం కంటే రెట్టింపు వేగంతో బండి వూరు దాటిపోయింది!— చిట్టి తన యిద్దరు అనుచరులతో కలిసి గుఱ్ఱాన్ని చిత్రగతులతో నడిపించడం ప్రారంభించాడు. ముగ్గురూ కలిసి గుఱ్ఱాన్ని రకరకాలైన పరీక్షలు చేస్తున్నారు. ఒకడు చక్రం పక్కని కమిచీకఱ్ఱ పెట్టి కటుకటు శబ్దం చేస్తున్నాడు ఒకడు విరామం లేకుండా ఈలలు వేస్తున్నాడు — 'చల్! చల్!' అ అరుస్తూ — బిగ్గరగా తిడుతూ — కొరడా కఱ్ఱతో చితగ్గొడుతూ గుర్రాన్ని భూమికీ ఆకాశానికీ మధ్య నడిపిస్తున్నాడు చిట్టి! — అప్పటికి నాకు ప్రమాదం బోధపడింది. ముగ్గురూ మంచి నిషాలో వున్నారు. వాళ్ళ ముగ్గురి దృష్టి గుర్రపు పరీక్షలో కేంద్రీకృతమైవుంది. అదే వేగం కొద్ది క్షణాలు సాగేసరికి గుఱ్ఱం వెనక కళ్ళెం తెగిపోయింది. దాన్తో చెక్క రాపిడి యెక్కువయ్యింది గుఱ్ఱానికి వెనక భాగం దెబ్బతగలడం ప్రారంభమయింది — గుఱ్ఱం బెదిరిపోయింది ముగ్గురూ హేమాహేమీలు యెంత లొంగదీసినా గుఱ్ఱం దారికి రాలేదు. బండి గతుకుల్లో పడి మమ్మల్ని అయిదడుగుల యెత్తుకు లేపుకువెళ్ళి కింద పారేస్తోంది అంతకంతకూ ఆకాశంలోంచి దూసుకుపోతోంది. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని

కూర్చున్నాం — దారిలో లారీలు, బస్సులూ, కారులూ బొమ్మల్లా కనిపిస్తూ పిస్తూనే మాయమై పోతున్నాయి. గుఱ్ఱం దయాధర్మం మీద ఆధారపడి — అది ఎటు తీసుకు పోతే అటే బండీ — బండితోపాటు మేము వెళ్ళిపోతున్నాం. గుఱ్ఱం ముక్కుకు సూటిగా పోతోంది. కాలవ వంతెన దగ్గర రోడ్డు వంకరగా మలుపు తిరిగి వుంది గుఱ్ఱం వంతెననూ రోడ్డునూ మలుపునూ పట్టించుకోవడం లేదు. తిన్నగా తీసుకు వెళుతోంది. కొద్ది క్షణాలలో కాలవలోకి లాగెయ్యడానికి సిద్ధంగా వుంది.

'చచ్చాంరా దేవుడా!' అంటూ అమాంతంగా గోపాలం బండిలోంచి వురికేశాడు. నేను కూడా దూకడానికి తయారవుతున్నాను. ఆ సమయంలో మెరకవల్ల బండి వేగం రవంత తగ్గింది. చిట్టి శిష్యు లిద్దరూ చెరో పక్క నుంచీ ముందుకు వురికి - గుఱ్ఱంతో సమానంగా పరుగెత్తి కాలవగట్టు చేరుకొనేసరికి బండి ఆపు చేశారు.

'చంపావోయ్ చిట్టీ! నిక్షేపంగా ఇంటికి పోతున్న వాళ్ళను పిలిచి ప్రాణాలు తీసినంత పని చేశావు.' అన్నాను కోపంతో.

'అబ్బే! ఇదీ ఒక గేలాపేనా? కొత్త గుర్రం సంగతి తేల్దానికి — ఇంకా చాలా తమాషా లున్నాయి మరోకమాటు చూపిస్తాను మీకు!' తేలిగ్గా అన్నాడు చిట్టి.

తొందరగా ఎక్కి వెళ్ళి నేల మీద కూర్చుని ఆయాసపడుతున్న గోపాలాన్ని బండిలో వేసుకొని ఊరు చేరుకున్నాం.

గోపాలానికి ఎముకలు విరక్కపోయినా వొళ్ళంతా హూనం అయి వారం రోజులవరకూ లేవలేదు.

అమావాస్యనాడు దుర్ముహూర్తంలో బయలుదేరి నందువల్లనే - ఆ రోజున అనేక అవమానాలు జరిగాయని, చివరకు పెద్ద ప్రమాదం జరిగి తనకు చావు తప్పి కన్ను లొట్టపోయినంత పని జరిగిందని గోపాలం అన్నాడు.

మరి నేనూ ఆ దుర్ముహూర్తంలోనే బయలుదేరాను కదా? నాకు ఒక చెడుగూ జరగలేదేం? — పైగా నే నెందుకు వెళ్ళానో ఆ పనికూడా పూర్తి అయింది.

ఒకవేళ తమను ఎవరైతే నమ్ముతారో వాళ్ళనే గ్రహాలు బాధ పెడతాయా? — తమమీద నమ్మకం లేనివాళ్ళకు — న్యాయంగా సక్రమమైన మార్గంలో నడిచేవాళ్ళకు అవి దూరంగా వుండడంలో అర్థం యేమిటి? — అసలు ఈ దుష్టగ్రహాలు అనేవి భూమ్మీదే కాని ఆకాశంలో లేవా? ... ఇంకా ఎన్నో సందేహాలు మిగిలిపోయాయి.

□□□